క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 43, వంకాయ 28, బెండ 38, పచ్చిమిర్చి 85, కాకర 45, బీర 35, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 75, క్యారెట్ 40, దొండ 23–28, చిక్కుడు 75, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 57, ఆలు 20, దోస 16, సొర 13, పొట్ల 23, ఉల్లి 18, చామగడ్డ 35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రేపు ఉచిత వైద్యశిబిరం

మలక్‌పేట: ఏఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్ శ్రీకర ఆస్పత్రి సౌజన్యంతో ఈనెల 25న ఆదివారం మూసారంబాగ్ డివిజన్ శ్రీపురం కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రెసిడెంట్ వేణుమాధవ్ తెలిపారు. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి హాజరై ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తారన్నారు. కీళ్ల మార్పిడి, తుంటి మార్పిడి సమస్యలపై ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి ఏసీపీగా పదోన్నతి పొందిన మధుసూధన్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కల్యాణ్‌యాదవ్, అనుదీప్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, శ్రవణ్, అషిఫ్, వేణుగోపాల్‌రెడ్డి, విజయ్, రాజు, మాచర్ల వరుణ్, మహేష్ యాదవ్, పింటూ, వినయ్, విప్లవ్, నగేష్ పాల్గొన్నారు.

సువార్త మహా సభలు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధి వాహెద్‌నగర్‌లోని దిపెంతకోస్తు మిషన్ చర్చిలో శుక్రవారం సువార్త మహాసభలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. బైబిల్ స్టడీస్, మధ్యాహ్నం పరిశుద్ధాత్మల వరముల కోసం కనిపెట్టు ప్రార్థనలు, సువార్త, పాపక్షమాపణ, రక్షణ, క్రైస్తవ విశ్వాస జీవితం, ఆధ్యాత్మిక ఏసుక్రీస్తు మహిమ ప్రార్థనలు చేసినట్లు పాస్టర్ శ్యామ్‌సుందర్ తెలిపారు. విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. బ్రదర్ శరవణన్, జరూసలేం మత్తయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, డీఈ దామోదర్‌రావు

ఎల్‌బీనగర్: కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. టీచర్స్ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. కాలనీవాసులు అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్‌రావు, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

మలక్‌పేట: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన విష్ణు, నరత్తం దాసు(34), లఖన్‌కలర్(36) ముగ్గురు కలిసి ఏజెన్సీ ఏరియాలో గంజాయిని కొని హైదరాబాద్‌లో విక్రయించడానికి ఆర్టీసీ బస్సులో భద్రాచలం, ఖమ్మం మీదుగా నగరానికి చేరుకుని దిల్‌సుఖ్‌నగర్‌లో బస్సు దిగారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాసు, లఖన్‌కలర్‌ను అదుపులోకి తీసుకోగా.. విష్ణు అక్కడ నుంచి తప్పించుకున్నాడు. వారి వద్ద ఉన్న 2.8 కిలోల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని జ్యుడిషీయల్ రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రధాన నిందితుడు విష్ణు పరారీలో ఉన్నాడు.

మెట్రో పొడిగింపు నిర్ణయంపై హర్షం

పలుచోట్ల సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు



చైతన్యపురి చౌరస్తాలో కేసీఆర్, కేటీఆర్, సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



వనస్థలిపురం కాంప్లెక్స్‌లో.. మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో రైలు పొడిగింపు నిర్ణయంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పలు ప్రాంతాల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకోవడం ఎల్‌బీనగర్ ప్రజానీకం సంతోషించదగ్గ విషయం పలువురు వ్యాఖ్యానించారు. చైతన్యపురి చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శివప్రకాష్, లక్ష్మీనారాయణ, జ్యోతి, జయశ్రీ, నరేందర్‌రెడ్డి, సంతోషయాదవ్, అప్పారావు, నరేష్, కృష్ణ, జలందర్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో..

గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, ఆనంద్‌గౌడ్, బాలాగౌడ్, రవిచారి, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

శివాజీ చౌక్‌లో..

చైతన్యపురి సాయినగర్ శివాజీ చౌక్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం వేశారు. బీఆర్ఎస్ చైతన్యపురి అధ్యక్షుడు మహేశ్‌యాదవ్, నాయకులు శరత్‌చంద్ర, నర్సిరెడ్డి, సుధాకర్, ప్రవీణ్‌చారి, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: ప్రజల సమస్యలు, ఆకాంక్షలు తెలిసిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో మెట్రో రైల్‌ను ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విస్తరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వనస్థలిపురం కాంప్లెక్స్‌లో కేసీఆర్ చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేశారు. అజయ్‌యాదవ్, మధుగౌడ్, సంతోష్ కురుమ, రాంబాబు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో..

ఎల్‌బీనగర్: మెట్రోను ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు పొడిగిస్తానని సీఎం కేసీఆర్ అంగీకరించినందుకు బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ ఆటోస్టాండ్ వద్ద సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనిల్‌చౌదరి, మహేష్, సతీష్‌చౌదరి, అమరేందర్‌డ్డి, నరేందర్‌గౌడ్, రాఘవేందర్‌రావు, రషీద్, కిరణ్, రాజు, రాజుయాదవ్, భాస్కర్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

హస్తినాపురంలో..

హస్తినాపురం: పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. శుక్రవారం సత్యంచారి ఆధ్వర్యంలో హస్తినాపురంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, పద్మానాయక్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణ, ఆదిలక్ష్మి, భిక్షపతిచారి పాల్గొన్నారు.



గడ్డిఅన్నారం డివిజన్‌లో..



బీఎన్‌రెడ్డినగర్ ఆటోస్టాండ్ వద్ద ..



హస్తినాపురంలో ..

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగోలు: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ నివాసం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట, అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ చైతన్యపురి సంయుక్తంగా ఆధ్వర్యంలో డయాబెటిక్ పరీక్షలు, గుండె పరీక్షలు, కంటి పరీక్షలు, చెవి ముక్కు గొంతుకు సంబంధించిన పరీక్షలను వైద్యులు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ విజయరంగా ఆధ్వర్యంలో తులసి మొక్కను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాహుల్‌గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి కాచం సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జీవీ సాగర్‌రెడ్డి, నాయకులు ఉదయ్‌గౌడ్, లింగాల నిఖిల్, రిషి, చిరంజీవి పాల్గొన్నారు.

జైలు స్థలం కబ్జా

డీజీ, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

చంచల్‌గూడ: సైదాబాద్ క్రాస్ రోడ్డులో జైళ్ల శాఖకు చెందిన స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించారని బీజేపీ కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ శుక్రవారం జైళ్ల శాఖ డీజీ, చంచల్‌గూడ సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాదాపు 200 గజాల స్థలం ఆక్రమించడమే కాకుండా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. స్థలం విలువ రూ. 3 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. స్థలం కబ్జాపై జైలు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రామ్మోహన్‌గౌడ్, వజీర్ ప్రకాష్‌గౌడ్ తదితరులు

నాగోలు: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో రావాలని బీఆర్ఎస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, సీనియర్ నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆకాంక్షించారు. కొత్తపేట ప్రసన్న మహంకాళి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను భారత ప్రధాన మంత్రిగా, మంత్రి కేటీఆర్ తెలంగాణ సీఎంగా చూడాలని ఆకాంక్షతో కొత్తపేట ప్రసన్న మహంకాళి ఆలయం నుంచి యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్ నిర్వహించిన పాదయాత్ర నేటికీ ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారి ఆకాంక్ష రాబోయే ఎన్నికలలో నెరవేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతనాయక్, మాజీ కార్పొరేటర్లు లక్ష్మీ ప్రసన్న, సామ రమణారెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: నిషేధిత డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు నగరానికి తీసుకువస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ త్రిస్సూర్ జిల్లా వడకంచేరి తాలుకాకు చెందిన చలపురత్ సుమేశ్ (30)డ్రైవర్‌గా పనిచేస్తూ రాజమండ్రిలోని దేవిచౌక్‌లో ఉంటున్నాడు. నిషేధిత 50 గ్రాముల ఎండీఎంఏను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఎండీఎంఏ 50 గ్రాముల డ్రగ్, రూ.2040 నగదు, మొత్తం రూ.5లక్షల విలువగల వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గతంలో సుమేశ్ గంజాయికి బానిసై గంజాయిని తరలించే క్రమంలో కేసు నమోదు చేయడం జరిగిందని అతనిపై పీడీయాక్టు నమోదు అయినట్లు సీఐ జలేందర్‌రెడ్డి వెల్లడించారు.

దివ్యాంగుల ఆసరా పెన్షన్ల పెంపుపై హర్షం

వనస్థలిపురం: దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు రూ. 3,116 నుంచి రూ. 4,116 వరకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జీఓ విడుదల చేయడం హర్షనీయమని డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు పేర్కొన్నారు. శుక్రవారం వనస్థలిపురం చింతలకుంటలోని డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.1000 పెన్షన్ పెరగడంతో ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి పరమేశ తదితరులు పాల్గొన్నారు.

డబ్బాల తొలగింపునకు యత్నం



మలక్‌పేట: టౌన్‌ప్లానింగ్ అధికారులు మూసారంబాగ డివిజన్ సలీంనగర్‌కు వెళ్లే దారిలో ఉన్న పాన్ షాపు, చెప్పుల డబ్బా తొలగించడానికి పూనుకున్నారు. దీంతో ఆందోళన చెందిన చిరువ్యాపారులు డబ్బాలలోని సామాన్లు బయట పెట్టుకున్నారు. ఎందుకు డబ్బాలు తొలగిస్తున్నారని చిరువ్యాపారులు అధికారులను ప్రశ్నించారు. రెంటింటిని మాత్రమే ఎందుకు తొలగిస్తున్నారని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా డబ్బాలు ఎట్లా తీస్తారని అధికారులను నిలదీశారు. కోర్టు ఆదేశాలున్నాయని అధికారులు చెప్పగా.. ఆర్డర్‌ను చూపించాలని బీజేపీ సీనియర్ నాయకుడు సత్యనారాయణయాదవ్, స్థానికులు పట్టుపడటంతో అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

భక్తిశ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దేవి ఉపాసకులు సోమ వెంకటమ్మ

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని న్యూ మారుతీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ, విజయదుర్గాదేవి ఆలయంలో వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని, అమ్మవార్లను పూలతో అందంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పూజల్లో దేవి ఉపాసకులు సోమ వెంకటమ్మ, సోమ యాదగిరి, సత్యనారయణగౌడ్, భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ చెక్కు లెటర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌కు చెందిన భువనేష్ సాయి తలకు సంబంధించిన వ్యాధితో ఇబ్బందులు పడుతుంటే చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల వరకు వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ కింద ఎల్‌ఓసీని మంజూరు చేయించిన లెటర్‌ను కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ఆరోగ్యం సమస్యల పట్ల పడుతున్న ఇబ్బందులకు ఈపథకం ఎంతో లబ్ధి జరుగుతోందని పేర్కొన్నారు. భువనేష్‌సాయి కుటుంబం ఆర్థికంగా లేకపోవడంతో తలకు సంబంధించిన సమస్యలకు వైద్యం చేయించుకోలేక పోయిందని దీంతో తనను సంప్రందించారని తెలిపారు. తాను వెంటనే సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేయించి మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, సత్యంచారి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గో వధ, అక్రమ రవాణాపై కఠినమైన చర్యలు తీసుకోవాలి



సైదాబాద్ ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చంచల్‌గూడ: గో వధ, గోవుల అక్రమ రవాణాపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్‌యాదవ్ శుక్రవారం సైదాబాద్ ఏసీపీ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. రానున్న బక్రీద్ పురస్కరించుకుని గోవుల అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుందని, ముఖ్యమైన కూడళ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏసీపీని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, నాయకులు సుధీర్, జైపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, వినోద్, శ్రీకాంత్, మోహన్‌కృష్ణ, ప్రదీప్, గౌతమ్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతోనే చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని దుర్గాభవానీనగర్ కాలనీలో రూ.30 లక్షల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రమేష్‌రెడ్డి, వెంకటేష్, యాదగిరిరెడ్డి, యాదిరెడ్డి, కిషోర్, నాయకులు ప్రభాకర్, ఉమామహేశ్వర్, జంగయ్య, శ్రీధర్‌రెడ్డి, సత్యప్రకాష్, నరేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో రేయాన్ విద్యార్థుల ప్రతిభ



నాగోలు: నవోదయ 2023 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 72 సీట్లు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి నాగోలు బండ్లగూడలోని రేయాన్ విద్యార్థులు ఎంపికయ్యారని రేయాన్ కోచింగ్ సెంటర్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్ ఉమారెడ్డి తెలిపారు. శుక్రవారం నాగోలు బండ్లగూడలోని రేయాన్ కోచింగ్ సెంటర్‌లో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు జనార్దన్ రెడ్డి, ఉమారెడ్డి మాట్లాడుతూ.. పోటీ ఏదైన సైనిక్, నవోదయలలో రేయాన్ సైనిక్‌లో నెంబర్–1గా నిలుస్తుందని తెలిపారు. సైనిక్ ఫలితాల్లో 63 సీట్లు సాధించడమే కాకుండా దేశంలోనే ప్రతిష్టాత్మకమైన, ఏవైక ఆర్ఐఎంసీ డెహ్రాడూన్‌కి వరుసగా 2022లో సాయితేజస్, 2023లో వై.వి సుహాస్‌రెడ్డి ఎంపికవ్వడమే మా ఘనతకు నిదర్శమని తెలిపారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి



మన్సూరాబాద్ చౌరస్తాలో.. కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. జాతీయవాదం కోసం పరితపించి, దేశం కోసం చనిపోయిన మహనీయుడని కొనియాడారు. జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి మన్సూరాబాద్ చౌరస్తాలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంపాపేట కార్పొరేటర్ మధుసూధన్‌రెడ్డి కర్మన్‌ఘాట్ చౌరస్తాలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెండింగ్ పనులను పూర్తిచేయండి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 15వ డివిజన్‌లోని పెండింగ్ పనులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. బడంగ్‌పేట కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జంగయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో మంచినీటి పైప్‌లైన్ల కోసం సీసీ రోడ్డును అడ్డంగా తవ్వేశారని, పైప్‌లైన్లు వేసేది పూర్తయినప్పటికీ రోడ్లు అలాగే వదిలివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మెథడిస్ట్ చర్చి ముందు మంచినీటి సరఫరా చేసే వాల్వ్ కోసం మున్సిపల్ సిబ్బంది గుంత తవ్వడంతో ప్రమాదకరంగా మారిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని, 15వ డివిజన్లో సీసీ రోడ్లు పూర్తిచేయించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీరాములు, అంజయ్య, నాగరత్నం, శ్రీధర్, అనిల్ తదితరులున్నారు.

మురుగు సమస్యను వెంటనే పరిష్కరిస్తా

హుడాకాంప్లెక్స్: డివిజన్‌లో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జలమండలి డీజీఎం సరిత అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి అంబేడ్కర్‌నగర్, సీఎం రోడ్డులోని శ్రీనివాసకాలనీలలో శుక్రవారం ఆమె పర్యటించారు. రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణకు రూ.13.2 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, రెండ్రోజుల్లో పనులు ప్రారంభం కానున్నట్లు వివరించారు. సీఎం రోడ్డులోని మురుగు సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.